


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 08-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :82 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఎన్నికల తర్వాతే కార్యాచరణ



2 లో

- ఆర్టీసీ విలీనం ఇంకా పెండింగ్
- 11 శాతం ఫిట్‌మెంట్ హామీ
- గుర్తింపు సంఘాల ఎన్నికలు కొనసాగింపు
- ఏపీ తరహా సమస్యలు వద్దు
- రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1152 కోట్లు
- కార్మికుడి కుటుంబానికి రూ.కోటి బీమా

## ఏపీలో కొత్త పార్టీకి శ్రీకారం!

- త్వరలో జెండా, అజెండా ప్రకటన
- మూడో ప్రత్యామ్నాయం అవసరమన్న సాయిరెడ్డి
- టీడీపీ, వైసీపీపై తీవ్ర విమర్శలు
- ప్రజా సమస్యలే కొత్త పార్టీ అజెండా
- సీఎం అభ్యర్థిని కాదన్న విజయసాయి
- మెంటార్‌గానే ఉంటానని స్పష్టం
- అన్ని వర్గాలకూ సీఎం అవకాశం ఉండాలన్న వ్యాఖ్య



2 లో

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఎప్పటి నుంచి కొత్త పార్టీ ప్రకటిస్తాను అని చెబుతున్నారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. ఆసక్తికర ప్రకటన చేశారు.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ వేదికకు శ్రీకారం చుడుతున్నట్లు మాజీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ పార్టీ అవసరముందని పేర్కొన్న ఆయన.. త్వరలోనే కొత్త పార్టీ జెండా, అజెండాను ప్రకటిస్తానన్నారు. ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ పార్టీని నిర్మించనున్నట్లు తెలిపారు. విజయవాడలో పార్టీ ఏర్పాటుపై ఆయన చేసిన ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఏపీలో ప్రస్తుతం టీడీపీ, వైసీపీ, జనసేనతో పాటు సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు ఉన్నప్పటికీ.. వాటిలో తగిన పోరాట పటిమ కనిపించడం లేదని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. గత 15 ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాలు ప్రధానంగా టీడీపీ, వైసీపీ చుట్టూనే తిరుగుతున్నాయని, ఒకసారి టీడీపీ, మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తున్నాయని అన్నారు. ఈ రెండు పార్టీలు ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని, వాటి మధ్య జరుగుతున్న రాజకీయ పోరాటంలో ప్రజలు నలిగిపోతున్నారని విమర్శించారు.

## ఆర్టీసీ, మెట్రోకు ఒకే పాస్

- త్వరలో ఉమ్మడి పాస్ విధానం
- రోజువారీ, నెలవారీ పాస్‌లకు ఏర్పాట్లు
- వేర్వేరు టికెట్లకు ఇక గుడ్‌బై
- ప్రయాణికులకు మరింత సౌలభ్యం
- చార్జీల ఖరారుపై కసరత్తు
- సమయం, ఖర్చు ఆదా కానుంది
- లక్షలాది ప్రయాణికులకు ఊరట

2 లో

## ఇప్పుడే ఎన్నికలైనా.. కూటమిదే గెలుపు!

- అన్ని సర్వేల్లోనూ కూటమికే ఆధిక్యం
- ప్రజల్లో ఎమ్మెల్యేలు మరింత పనిచేయాలి
- ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలి
- డీఎస్సీపై వాస్తవాలు చెప్పాలి
- వెలిగొండపై తప్పుడు ప్రచారమంటూ ఫైర్
- అసెంబ్లీకి రావడానికి ప్రతిపక్షం భయపడుతోందా?
- సోషల్ మీడియాపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం



2 లో

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తక్షణమే ఎన్నికలు నిర్వహించినా కూటమి విజయం సాధిస్తుందని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ఆయన ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. అన్ని సర్వేల్లోనూ మరోసారి కూటమి గెలుపు ఖాయమని చెబుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లో మరింతగా పనిచేస్తూ పార్టీకి బలం చేకూర్చాలని సూచించారు. అయితే, 'గొడ్డలి పార్టీ' ఫేక్ ప్రచారాలను ఆధారాలతో తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మంచి పని జరుగుతుంటే విమర్శలు చేయడానికి ఆ పార్టీ సిద్ధంగా ఉంటోందని ఆరోపించారు. డీఎస్సీ-2025 విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలను ప్రజలకు వివరించి వాటిని ఖండించాలని సూచించారు. "చెడు ప్రచారాలను వాస్తవం అనే బ్రహ్మాస్త్రంతో తిప్పికొట్టాలి" అని అన్నారు.

## కృష్ణా నీళ్లపై ఉత్తమ్ స్ట్రాంగ్ కౌంటర్!

- నేను ఆర్మీ వ్యక్తిని.. దేశం, ప్రజలే ఫస్ట్
- 811 టీఎంసీల్లో మన వాటా 299 టీఎంసీలే
- 555 టీఎంసీల కోసం బలంగా వాదిస్తున్నాం
- కేసీఆర్, హరీశ్‌రావులే నీటి కష్టాలకు కారణం
- రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు.. ప్రయోజనం శూన్యం
- కాళేశ్వరం కోసం పాలమూరును బలి చేశారు
- ఎస్ఎల్బీసీని పూర్తి చేసి తీరుతాం: ఉత్తమ్

2 లో

## ఎన్నికల బరిలోకి ఆశావహులు!

- 11న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల ప్రకటన
- ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలకు అవకాశం
- ఈ నెల 23, 24తో ముగియనున్న పదవీకాలం
- ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం చేసిన ఎస్ఈసీ
- మున్సిపాలిటీల ఓటర్ల జాబితాలపై ఫోకస్
- గ్రామీణ, పట్టణ ఎన్నికలకు పక్కా ప్లాన్

2 లో


## కొత్త పింఛన్లకు షెడ్యూల్ విడుదల



2 లో

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** రాష్ట్రంలో కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు కూటమి ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలు జారీ చేసింది.

## తెలంగాణలో సర్ గడువు పొడిగింపు





2 లో

- ఓటర్ల క్లెయిమ్స్.. అభ్యంతరాలకు మరో అవకాశం
- అక్టోబర్ 7 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 5లోపు దరఖాస్తుల పరిష్కారం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా
- అర్హులైన ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలి
- ఓటు నమోదుకు ఈసీ మరో ఛాన్స్
- ఓటర్ల సవరణ షెడ్యూల్‌లో కీలక మార్పు

# అసెంబ్లీ వద్ద హైడ్రామా!

- బ్లాక్ టీషర్టులతో బీఆర్ఎస్ నిరసన
- అసెంబ్లీ గేటు వద్ద హైడ్రామా
- హరీశ్‌రావును అరెస్ట్ చేసిన పోలీసులు
- టీషర్ట్ విప్పి హరీశ్ నిరసన
- కేటీఆర్‌కు గాయాలు.. పోలీసులపై ఫైర్
- 'రెండేళ్లలో మా ప్రభుత్వమే'.. కేటీఆర్ వార్నింగ్
- 'చీర లాగారు.. తొక్కారు'.. సునీత కన్నీరు
- అస్వస్థతతో కిందపడిన జగదీశ్‌రెడ్డి
- 1000 రోజుల పాలనపై భగ్గుమన్న బీఆర్ఎస్







**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు.

మిగతాది 2 లో..

## ఆక్వా రైతుల క్రాప్ హాలిడే హెచ్చరిక

- 30లోపు ఫీడ్ ధరలు తగ్గించాలి
- అక్టోబర్ 1 నుంచి కొనుగోళ్లు బంద్
- ఫీడ్, సీడ్ ధరలపై రైతుల ఆగ్రహం
- సాగు ఖర్చులు పెరిగి నష్టాలు
- గిట్టుబాటు ధర లేక రైతుల గగ్గోలు
- సమస్యలు తీరకపోతే క్రాప్ హాలిడే




2 లో

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆక్వా రైతులు పోరాటం తీవ్రం చేస్తున్నారు.. తమ సమస్యలు పరిష్కరించకపోతే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్ పెట్టారు ఆక్వా రైతులు.. ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే క్రాప్ హాలిడేకు వెళ్లాలని ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సు కీలక తీర్మానం చేసింది.

## ఓట్లపై బీజేపీ కుట్ర: రేవంత్!

- బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలంటూ ఆరోపణ
- బీజేపీ వ్యతిరేక ఓట్లే టార్గెట్?
- కొడంగల్‌లో 81 వేల ఓట్లపై అనుమానం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- బీఆర్ఎస్ మౌనంపై సీఎం ఫైర్
- 2029లో మోదీ ఓటమికి పునాది ఇదే!
- మోదీకి వ్యతిరేకంగా పోరాటానికి పిలుపు



2 లో

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వ్యతిరేకులను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేకంగా ఏజెన్సీలను పెట్టుకుందని, 2009 నుంచి ఓటింగ్ సరళని పరిశీలించి బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ అంతా సిద్ధమవుతోందని గ్రహించి ఎస్ఐఆర్ రూపంలో కొత్త కుట్రలు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ నోరెత్తడం లేదని మండిపడ్డారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో మాట్లాడిన సీఎం.. జాతీయ స్థాయిలో సెక్యూలర్ శక్తులు సమిష్టిగా మోడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 08-09-2026

# అసెంబ్లీ వద్ద హైడ్రామా!

**మొదటి పేజీ తరువాయి**

పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు.

మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది.

# ఓట్లపై బీజేపీ కుట్ర: రేవంత్!

**మొదటి పేజీ తరువాయి**

**నా నియోజకవర్గంలో కుట్ర:**

ముఖ్యమంత్రిగా ఉన్న నా నియోజకవర్గం కొడంగల్ నుంచి వలస వెళ్లిన వేల మంది పేదల ఓట్లను ఈసీ తొలగిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గంలో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో చేర్చారని ధ్వజమెత్తారు. ఇవాళ్టి ఓట్లతోనే 2029లో మోడీ ఓటమికి పునాది పడుతుందని ఓట్ల తొలగింపుపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎర్రజెండాను చూస్తే పేదోడికి ఒక నమ్మకం అని దేశానికి మోడీ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి.. ఆయన ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అనగానే మైనార్టీ ఓట్లు అని భావిస్తున్నారని పేదలు, గిరిజనుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందన్నారు. కమ్యూనిస్టులు గత ప్రభుత్వంలో కార్మికులు, పేదల సమస్యలపై నిలదీస్తూ చేసిన పోరాటాలు మాకు ఉపయోగపడ్డాయన్నారు. ఆ పోరాటాలతోనే 2023 డిసెంబర్ లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఎన్నికల్ల కలిసి పోటీ చేసినా చేయకపోయినా కమ్యూనిస్టుల పోరాటం ప్రత్యక్షంగా పరోక్షంగా మా ప్రభుత్వం ఏర్పడటానికి దోహదపడిదన్నారు.

**సారంపల్లి వాటి వారు మరొకరు లేరు:**

రైతుల కోసం తన జీవితాన్ని సర్వం ధారపోసిన సారంపల్లి మల్లారెడ్డిని కోల్పోవడం రైతాంగానికి తీరని లోటు అని సీఎం అన్నారు. కాలక్రమేణా రైతు సమస్యల పట్ల అవగాహన ఉన్న నాయకత్వం, రైతు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలకు సూచన చేయాల్సిన నాయకత్వం సన్నగిల్లుతోందన్నారు. చదువు కంటే సమస్య పట్ల అవగాహన, సంస్కారంతో కూడిన అంశాలను లేవనెత్తడంలో సారంపల్లతో పోటీ పడే వారు ఈ తెలంగాణలో ఎవరూ లేరన్నారు. కౌలు రైతులు, రైతు గిట్టుబాటు ధరలతో పాటు రైతు అంశాలపై ఆయన అవగాహన గొప్పదన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల కారణంగా కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందన్నారు.

# కొత్త పింఛన్లకు షెడ్యూల్ విడుదల

**మొదటి పేజీ తరువాయి**

ఈ మేరకు అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు తదితర అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా అధికారులు తెలిపారు. తాజాగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. కొత్ పింఛన్లకు నేటి నుంచి ఈ నెల16 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు కార్యాలయాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా వచ్చిన అప్లికేషన్లను ఈ నెల 17 నుంచి 21 వరకు క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను చేపడుతారు. ఇక సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. చివరగా సెప్టెంబర్ 25, 26 తేదీల్లో పింఛన్‌కు అర్హులైన వారి దరఖాస్తులను ఆమోదించనున్నారు. ఆ తర్వాత దశలవారీగా కొత్త పింఛన్లను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయనున్నారు.

# ఆర్టీసీ, మెట్రోకు ఒకే పాస్




**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** హైదరాబాద్ నగర ప్రయాణికులకు ఆర్టీసీ, మెట్రో రైలు సేవలను మరింత సులువుగా, ఒకే టికెట్ విధానంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాస్ విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ఉమ్మడి పాస్‌ల జారీ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా రవాణాను సులభతరం చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు ఆయన మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్లను పరిశీలించారు. మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి పాస్‌లను జారీ చేయనున్నారు. ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా నెలవారీ, రోజువారీ పాస్‌ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.

అయితే, రెండు ప్రజా రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం కుదిర్చి, ప్రయాణ చార్జీలను ఎలాంటి గందరగోళం లేకుండా వీలైనంత త్వరగా ఖరారు చేయాలని సీఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రయాణికులు వేర్వేరు టికెట్లు, పాస్‌లు తీసుకోవాల్సిన శ్రమ తప్పనుంది. దీనివల్ల సమయంతో పాటు ప్రయాణ ఖర్చులు కూడా ఆదా అవుతాయి. ఈ కంబైన్డ్ పాస్ విధానం అందుబాటులోకి వస్తే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజూ లక్షలాది మంది ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు గొప్ప ఉపశమనం లభించనుంది. ఉమ్మడి చార్జీల ఖరారు ప్రక్రియ పూర్తయిన వెంటనే అధికారులు అధికారికంగా విధివిధానాలను వెల్లడించనున్నారు.

# తెలంగాణలో సర్ గడువు పొడిగింపు

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం మరోసారి సవరించింది. ఓటర్ల నమోదు, క్లెయిమ్‌లు అలాగే అభ్యంతరాల స్వీకరణకు సంబంధించిన గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం సోమవారం సాయంత్రం అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, సవరించిన షెడ్యూల్ ప్రకారం..


PRESS NOTE

The Election Commission of India has revised the schedule for Special Intensive Revision in the State as under:-

| Sl. No. | Activities | Existing Schedule | Revised Schedule |
|---|---|---|---|
| 1 | Period for filing Claims and Objections | 17.08.2026 to 16.09.2026 | 17.08.2026 to 07.10.2026 |
| 2 | Notice Phase / Disposal of Claims and Objections | 17.08.2026 to 15.10.2026 | 17.08.2026 to 05.11.2026 |
| 3 | Final Publication | 19.10.2026 | 09.11.2026 |

Sd/-
Chief Electoral Officer,
Telangana

క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించారు. అందిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని పరిష్కరించే ప్రక్రియను నవంబర్ 5 లోపు పూర్తి చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలన, సవరణలు పూర్తిగా ముగిసిన తర్వాత తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ గడువు పొడిగింపు అవకాశాన్ని రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది.

# ఆక్వా రైతుల క్రాప్ హాలిడే హెచ్చరిక

**మొదటి పేజీ తరువాయి**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో రైతులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు క్రాప్ హాలిడే ప్రకటించాలని తీర్మానించారు. ఈ నెల 30వ తేదీలోపు రొయ్యల ఫీడ్ ధరలను తగ్గించాలని, రొయ్యల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని సదస్సు డిమాండ్ చేసింది. అక్టోబర్ 1 నుంచి హేచరీలు, ఫీడ్, మెడిసిన్ కొనుగోళ్లను నిలిపివేయాలని నిర్ణయించింది. హైకోర్టు తీర్పు మేరకు జూన్ వరకు అమల్లో ఉన్న పాత ధరలకే ఫీడ్ విక్రయించాలనే నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం అమలాపురంలో భారీ స్థాయిలో 'ఆక్వా రైతు బ్రతుకు పోరాటం' పేరుతో మహాసభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది రైతులు తరలివచ్చారు. పేరూరు వై జంక్షన్ నుంచి అమలాపురం క్షత్రియ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ చేపట్టి పెరిగిన సీడ్, ఫీడ్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరగడంతో సాగు చేసినా నష్టాలు వస్తున్నాయని తెలిపారు. రొయ్యలకు గిట్టుబాటు ధర లభించకపోవడం, ఫీడ్ ధరల పెరుగుదల, ఇతర సాగు సమస్యలు రైతులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని పేర్కొన్నారు. ఫీడ్ ధరలపై రైతుల ఆందోళనకు సంబంధించి గతంలో ప్రభుత్వం, తయారీ సంస్థల మధ్య చర్చలు కూడా జరిగాయి.

గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా ద్వారా సమస్యలు వెలుగులోకి వచ్చిన వెంటనే స్పందించేవారని రైతులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం వేలాది మంది రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆక్వా రైతుల సమస్యల అధ్యయనం కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయడం లేదని రైతులు ఆరోపించారు. సీడ్, ఫీడ్ ధరలను నియంత్రించడంతో పాటు ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మహాసభ వేదికగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆక్వా రంగంలో నాణ్యమైన సీడ్ సరఫరా, ట్రేసబిలిటీ లేని హేచరీలపై చర్యలు, విద్యుత్ రాయితీ పెంపు, నీటి మోటార్ల విద్యుత్ వినియోగంపై సడలింపులు, రొయ్యల కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం జోక్యం వంటి అంశాలు కూడా రైతుల ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. ఆక్వా సెస్ ద్వారా వచ్చే నిధులు రైతుల సంక్షేమానికే వినియోగించాలని, ఎం ఎఫ్టిబి ద్వారా సబ్సిడీలు అందించాలని రైతులు కోరుతున్నారు. వైరస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. రైతుల భారీ రాకతో అమలాపురంలో సందడి నెలకొంది. సమస్యలు పరిష్కరించకపోతే క్రాప్ హాలిడేకు వెళ్లే నిర్ణయం నేపథ్యంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో ఆక్వా రైతులు ఫీడ్ ధరలు, మార్కెట్ ధరల తగ్గుదల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

# ఏపీలో కొత్త పార్టీకి శ్రీకారం!

**మొదటి పేజీ తరువాయి**

అయితే, టీడీపీ, వైసీపీలు కుటుంబ పార్టీలుగా మారాయని, రెండు పార్టీల అజెండా ఒకటేనని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ప్రజలకు గోరంత చేసి తమకు కొండంత ప్రయోజనం పొందడమే వాటి ధ్యేయంగా మారిందన్నారు. పొలాల్లో, నదుల్లో ఇసుక తీసుకోవడం నుంచి రిజిస్ట్రేషన్, ఎన్‌ఓసీ, వ్యాపార కార్యకలాపాల వరకు రౌడీ మామూళ్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. ఎంపీ నుంచి కౌన్సిలర్ వరకు ఈ పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

రాజకీయ నాయకుల పని మద్యం దుకాణాలు, సెటిల్మెంట్లకే పరిమితమైందని సాయిరెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును తిరిగి సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టడంతో ప్రజా సంక్షేమాన్ని పక్కన పెడుతున్నారని అన్నారు. అధికార పార్టీ తమిళనాడు తరహా రాజకీయాలను రాష్ట్రంలో ప్రారంభించిందని, ప్రత్యర్థి పార్టీలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రెండు ప్రధాన పార్టీల రాజకీయాలు రక్తపాతం సృష్టించే విధంగా ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం ఆడబిడ్డల రక్షణపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. తాను స్థాపించబోయే కొత్త పార్టీకి సీఎం అభ్యర్థిని కాదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. బాల్‌థాకరే తరహాలో మెంటార్ పాత్రలో ఉంటానని తెలిపారు. పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వాన్ని నడిపించడంలో మార్గనిర్దేశం చేస్తానని, అయితే ముఖ్యమంత్రి పదవిని ఆశించబోనన్నారు. తన కుటుంబ సభ్యుల జోక్యం కూడా పార్టీలో ఉండదని స్పష్టం చేశారు.

కేవలం కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల నుంచే ముఖ్యమంత్రులు కావాలా అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. బీసీలు, కాపులు, వెలమలు తదితర అనేక సామాజిక వర్గాల్లో సీఎం అయ్యే సామర్థ్యం ఉన్న వారు లేరా అని ప్రశ్నించారు. సామర్థ్యం ఉన్న నాయకులను అణగదొక్కి రెండు వర్గాలకే సీఎం పదవి పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా సామర్థ్యం ఉంటే ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందన్నారు. తాను నమ్మే వెంకటేశ్వరస్వామి సాక్షిగా చెబుతున్నానని, కొత్త పార్టీలో తాను మెంటార్‌గా మాత్రమే వ్యవహరిస్తానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు పార్టీని నిర్మిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, గత రెండేళ్లుగా తాను ఒక పుస్తకంపై పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రెడ్డి సామాజిక వర్గం ఎలా ఉద్భవించింది, ఆ తర్వాత దాని పరిణామాలు ఎలా కొనసాగాయనే అంశాలపై సుమారు 350 పేజీల పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఈ పుస్తకాన్ని ఎలాంటి కులాభిమానంతో రాయలేదని, ఆసక్తితో అధ్యయనం చేసి రూపొందించానని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

# ఇప్పుడే ఎన్నికలైనా.. కూటమిదే గెలుపు!

**మొదటి పేజీ తరువాయి**

వెలిగొండ ప్రాజెక్టుపైనా తప్పుడు ప్రచారం చేశారని చంద్రబాబు విమర్శించారు. బోరింగ్ మిషన్ అడ్డంగా ఉన్న సమయంలో, పనులు పూర్తికాకముందే వెలిగొండను జాతికి అంకితం చేశామని డ్రామాలు ఆడారని ఆరోపించారు. తాను వెలిగొండను ప్రారంభిస్తే, గతంలోనే తమ కుటుంబం పూర్తి చేసిందంటూ మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు అందించే ప్రయత్నాలను కూడా వక్రీకరిస్తున్నారని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలను తరలిస్తుంటే వాటిని పురుషోత్తపట్నం నీళ్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి గతంలో 'గొడ్డలి పార్టీ' అడ్డుపడిందని ఆరోపించారు. తప్పు చేయకుండా ఎవరైనా విషయాలను వక్రీకరిస్తే, దిమ్మతిరిగేలా సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

ఏపీపీఎస్సీలో గతంలో అడ్డగోలు అక్రమాలు, అవకతవకలు జరిగాయని చంద్రబాబు ఆరోపించారు. 'హిట్-రన్-హైడ్' విధానంలో ప్రతిపక్షం వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. చర్చించేందుకు అసెంబ్లీకి రావడం లేదని, సభలో చర్చ జరిగితే వాస్తవాలు బయటకు వచ్చి ప్రజలకు తెలుస్తాయనే భయం వారికి ఉందని అన్నారు. బయట కూర్చొని అసత్యాలను పదేపదే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను పార్టీ కార్యకలాపాల్లో తప్పనిసరిగా ఉపయోగించాలని చంద్రబాబు సూచించారు. వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో డిజిటల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తప్పుడు ప్రచారాలకు వెంటనే ఆధారాలతో సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు మరింతగా ఎదగడానికి పార్టీ పూర్తిగా సహకరిస్తుందని చంద్రబాబు చెప్పారు. అదే స్థాయిలో ఎమ్మెల్యేలు కూడా పనిచేయాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రజలకు సేవ చేయడంతో పాటు పార్టీకి మరింత బలం చేకూర్చాలని పిలుపునిచ్చారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.




# ఎన్నికల తర్వాతే కార్యాచరణ

**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆర్టీసీ విలీనంపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అనేది ఇంకా కార్యాచరణలోకి రాలేదన్నారు. గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరిపిన తర్వాతే కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన మంత్రి.. ఆర్టీసీతో ప్రభుత్వం చర్చల్లో గుర్తింపు పొందిన కార్మిక సంఘం కోసం ఎన్నికలు నిర్వహించడం, ప్రభుత్వంలో విలీనం చేసి 11 శాతం ఫిట్ మెంట్ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కార్మిక శాఖ ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆర్టీసీ జేఏసీతో జరిగిన చర్చల అంశాల నుంచి ప్రభుత్వం ఎక్కడా పక్కకు వెళ్లడం లేదని ఆర్టీసీ విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన విలీనంతో అనేక సమస్యలు వచ్చాయని అలాంటి ఇబ్బందులు ఇక్కడ ఉండొద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియనిది కాదు:

నాకు కూడా చాలా బాధగా ఉంది. కానీ ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తెలియనిది కాదు. 2017 2024 వరకు 13 వేల మంది రిటైర్డ్ అయ్యారు. వారికి రూ. 1152 కోట్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం రాష్ట్రంపై ఎలా అప్పుల భారం మోపిందో ఆర్టీసీ సంస్థపై కూడా అలాగే అప్పుల్లో ముంచిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి, సంస్థకు పూర్తి కన్సర్న్ ఉందన్నారు. ఆర్థిక వెసులుబాటును బట్టి చెల్లింపులు చేస్తున్నామన్నారు. మేము అధికారంలోకి వచ్చాక అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మికుడు మరణిస్తే రూ.కోటి వరకు ఇచ్చేలా ఇన్సూరెన్స్ ఇస్తున్నామన్నారు.

అవసరమైతే ఇంకా ఇస్తాం:

ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వానికి ఆర్టీసీ స్థలాలు ఇచ్చామని అవసరం అయితే ఇంకా కూడా ఇస్తాం అన్నారు. గతంలో ఆర్టీసీ కోసం ప్రభుత్వం తమకు స్థలాలు కేటాయించిందని ఇప్పుడు అవసరం మేరకు ఆర్టీసీ ఇస్తోందని ఇది ప్రభుత్వంతో ఆర్టీసీకి ఉన్న సమన్వయం అన్నారు. పేదల ఇళ్ల కోసం స్థలాలు ఇస్తే నేరం చేసినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రయాణికులకు సేవలు, కార్మికుల సంక్షేమం విషయంలో మా ప్రయత్నం కొనసాగుతోందని దీన్ని ప్రశంసించకపోయినా పర్వాలేదు కానీ విమర్శించి ఆర్టీసీ కార్మికుల నైతికతను దెబ్బతీయవద్దన్నారు. ఆర్టీసీ విలీనం మా బాధ్యత అని అంతే తప్ప దాన్ని ఇవాళ, రేపే చేయాలని మాట్లాడటం సరికాదన్నారు.

# కృష్ణా నీళ్లపై ఉత్తమ్ స్ట్రాంగ్ కౌంటర్!



**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** తాను ఆర్మీ వ్యక్తినని.. తనకు దేశం, ప్రజలు ఫస్ట్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన తెలంగాణ, ఏపీ జల వివాదాలపై స్పందించారు. జలాలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నామనడం దారుణమన్నారు. తాము అధికారంలోకి వచ్చాకా కృష్ణా నీళ్ళ హక్కులపై గట్టిగా కొట్లాడుతున్నామని చెప్పారు. మంత్రిగా తాను ట్రిబ్యునల్ వాదనలకు హాజరయ్యానని చెప్పారు. 811 టీఎంసీల్లో 299 టీఎంసీలు మనకు, 512 టీఎంసీలు ఏపీకి కేసీఆర్, హరీష్ రావు రాసిచ్చారని తెలిపారు. 555 టీఎంసీలు కావాలని తాము వాదిస్తున్నామన్నారు. కృష్ణా, గోదావరి బోర్డులను రాష్ట్ర విభజన సమయంలో ఏర్పాటు చేశారని, విభజన చట్టాన్ని తానే రాయించానని కేసీఆర్ చెప్పారు కదా అని గుర్తు చేశారు.

"ఎల్ నినో నేపథ్యంలో 30 శాతం లోటు ఉంది.. దీనిని మేమేమీ సృష్టించలేదు కదా. ముందు నుంచి తాము ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందిగా రైతులకు చెప్తున్నాం. ఇప్పుడు నీళ్లు లేకపోవడానికి కేసీఆర్ కూడా కారణమే. తుమ్మిడిహట్టిని పూర్తి చేసి ఉంటే 16 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవి. కమీషన్లు లేవని ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చారు. వాళ్ళు అధికారంలోకి వచ్చాక తుమ్మిడిహట్టికి జాతీయ హోదా ఇవ్వాలని లేఖ కూడా రాశారు. పాలమూరు రంగారెడ్డిని ఒరిజినల్‌గా జూరాల సోర్సుగా నిర్మించేందుకు జీవో ఇచ్చారు. దానిని శ్రీశైలంకు మార్చింది కేసీఆర్. నార్లాపూర్ దగ్గర పంపులు ఒక గంట నడిపి తామే ప్రాజెక్టును కట్టినట్టు చెప్పుకుంటున్నారు. మేము రిపేర్లు చేసి నడిపిస్తున్నాం. నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్ సాగర్, ఎస్ఎల్బీసీని పడవు పెట్టి పోయారు. 1.80 లక్షల కోట్లు ఖర్చు చేసి పైసా ప్రయోజనం చెయ్యలేదు. జూరాల నుంచి పాలమూరు కట్టి ఉంటే ఎప్పుడో 70 టీఎంసీలు తరలించి 10 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవి. డిండి ప్రాజెక్టులు అసలు సోర్సును కూడా చెప్పలేదు. మేము వచ్చాకా సోర్స్ ఫైనల్ చేసి టెండర్లు కూడా పిలిచినం. ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తాం. గౌరవెల్లి, సీతారామ సాగర్, డిండి వంటి ప్రాజెక్టులకు పదేండ్లు అధికారంలో ఉంది కూడా పర్యావరణ అనుమతులు ఎందుకు తీసుకోలేదు..?." అని ఉత్తమ్ తెలిపారు.

"ప్రాజెక్టులకు 2000 కోట్ల పనులే ఉన్న.. దానిని 20 వేల కోట్లకు పెంచారు. పాలమూరు ప్రాజెక్టుకు కనీసం డిస్ట్రిబ్యూటరీలు కట్టలేదు.. భూమి సేకరించలేదు. రైతుల కష్టాలకు మిస్టర్ ఎల్ నినో, మిస్టర్ కేసీఆర్ మాత్రమే కారణం. కాళేశ్వరం అడిషనల్ టీఎంసీ కోసం.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును బలి చేశారు. మేము వచ్చాకే కృష్ణాలో ఎక్కువ నీళ్లు వాడినం. ఆయకట్టు పెరిగింది.. వడ్ల ఉత్పత్తి ఎక్కువ జరిగింది మా పాలనలోనే. వడ్ల సమీకరణలో తొలుత కొంత సమస్య వచ్చిన మాట వాస్తవమే.. బెంగాల్ , బీహార్ నుంచి హమాలీల కొరతతో సమస్య వచ్చింది. ఆ తర్వాత మళ్లీ రికార్డ్ స్థాయిలో వడ్లు సేకరించినం. ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకుంటున్నాం. తాము కట్టి కూలిపోయిన ప్రాజెక్ట్ కాళేశ్వరంను చూపించడానికి జనాన్ని తీసుకెళ్తారా. నేను రాష్ట్రానికి ఇరిగేషన్ మంత్రిని.. ఎవరు సలహాదారుగా ఉండాలో నేను డిసైడ్ చేస్తా.. వాళ్ళు కాదు." అని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

# ఎన్నికల బరిలోకి ఆశావహులు!




**న్యూస్ డెస్క్, 07 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే పోటీకి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫొటో గుర్తింపుతో కూడిన పూర్తి స్థాయి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేతా ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల డ్రాఫ్ట్, ప్రాథమిక ఓటర్ల జాబితాలను ఈ నెల 11న సంబంధిత మండల పరిషత్ కార్యాలయాలు, ఇతర నిర్ణీత కేంద్రాల్లో ప్రజల కోసం నోటీసు బోర్డులలో ప్రదర్శించనున్నారు. అదేవిధంగా ఓటర్లు తమ పేర్లను సరిచూసుకునేందుకు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులుంటే దరఖాస్తు చేసుకోవడానికి ఆ డ్రాఫ్ట్ ఓటర్లు లిస్టు ఉపయోగపడనుంది.

ముగియనున్న పదవీకాలం..

గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక సంస్థలైన మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల పదవీకాలం ఈ నెల 23, 24 తేదీల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా, సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. మరోవైపు రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలపై కూడా ఎస్ఈసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 59 మున్సిపాలిటీలకు సంబంధించి ఓటర్ల జాబితాలను కూడా ప్రకటించారు. త్వరలోనే మిగిలిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించిన ఓటర్ల జాబితాలను కూడా వెల్లడించనున్నట్లుగా ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏకకాలంలో, విడతల వారీగా ఎన్నికల నిర్వహించేందుక ఏర్పాట్లపై అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది.

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**• బీజేపీ అసెంబ్లీ ముట్టడిలో తీవ్ర ఉద్రిక్తత, నేతల అరెస్ట్**



ఇది కద నిజం, హైదరాబాద్ :విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ కన్వినర్ మల్లారెడ్డి, సీనియర్ నాయకులు రాజు పహిల్వాన్‌లను పోలీసులు ఆందోళన స్థలంలోనే అదుపులోకి తీసుకుని, అనంతరం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అనంతరం జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, విద్యార్థులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బహదూర్‌పురాలో సరికొత్త బజాజ్ న్యూ జనరేషన్ పల్సర్ 125, పల్సర్ 150 బైక్‌లు ఆవిష్కరణ



ఇది కద నిజం,బహదూర్‌పురా:

బహదూర్‌పురాలోని సిద్ధివినాయక బజాజ్ షోరూంలో సరికొత్త '2026 బజాజ్ పల్సర్ 125, పల్సర్ 150' న్యూ మోడల్ వాహనాలను ఘనంగా ఆవిష్కరించారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ కే.వి. బాబుల్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్, కిషన్ బాగ్ కార్పొరేటర్ హుస్సేని పాషా ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన బైక్‌లను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సిద్ధివినాయక షోరూం మేనేజర్ ఏ. సంతోష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో స్పోర్ట్స్ బైక్ విభాగంలో పల్సర్ తన ప్రత్యేక ముద్ర వేసుకుందని, ఇప్పటివరకు దాదాపు రెండు కోట్ల మంది వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకుందని తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఇప్పుడు కొత్త తరం పల్సర్ మోడళ్లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కొత్తగా లాంచ్ అయిన ఈ మోడళ్లలో అప్‌డేటెడ్ స్పోర్టీ లుక్, వెడల్పాటి ఫ్యూయల్ ట్యాంక్, బలమైన ఫ్రేమ్, ఫుల్ ఎల్ఈడీ లైటింగ్ సెటప్‌తో పాటు మోడర్న్ టిఎఫ్టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, బ్లూటూత్ కనెక్టివిటీ, మెరుగైన మైలేజ్, శక్తివంతమైన ఇంజిన్ వంటి అధునాతన ఫీచర్లను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ధరల వివరాలను వెల్లడిస్తూ కొత్త పల్సర్ 125 ప్రారంభ ఎక్స్-షోరూం ధర రూ. 93,226 కాగా, పల్సర్ 150 ప్రారంభ ధర రూ. 1,13,947 గా నిర్ణయించినట్లు తెలిపారు. అత్యంత ఆకర్షణీయమైన లుక్‌లో లభించే ఈ బైక్‌లకు సంబంధించి బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభమయ్యాయని, తక్కువ డౌన్ పేమెంట్ మరియు సులభ వాయిదా సౌకర్యం కూడా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, బజాజ్ బైక్ ప్రేమికులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పుగూడలో ఘనంగా గణేష్ ఆగమన్

**• 50వ వార్షికోత్సవం వేళ 'వికసిత్ భారత్' థీమ్‌తో వినాయక ప్రతిష్ట**



ఇది కద నిజం,హైదరాబాద్:

హైదరాబాద్ పాతబస్తీలోని ఉప్పుగూడలో శ్రీ మల్లిఖార్జున నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమన్ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. డీజే హోరెత్తించే పాటలు, యువకుల ఉత్సాహపూరిత నృత్యాలు, వర్ణరంజిత ఎల్ఈడీ విద్యుత్ దీపాల కాంతులతో ఉప్పుగూడ పరిసర ప్రాంతాలు మారుమోగిపోయాయి. సంఘం ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేకంగా 'వికసిత్ భారత్' థీమ్‌తో వినాయకుడిని ప్రతిష్టిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో 2047 నాటికి భారతదేశం అన్ని రంగాల్లో ఎలా అభివృద్ధి చెందబోతోందో స్పష్టంగా వివరించేలా వివిధ నమూనాలు, అంశాల ద్వారా ఈ థీమ్‌లో ప్రదర్శించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రత్యేక వినాయక మండపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా కిక్కిరిసిన భక్తజనం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగగా, భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నకొడంగల్ పరిధిలోని శ్రీరామలింగేశ్వర గుట్టపై ఉన్న సిద్ధులగుట్ట మందిరం సమీపంలోని పాలగుండం వద్ద భక్తుల సందడి నెలకొంది. సుమారు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన పాలగుండానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని స్థానికులు తెలిపారు. పాలగుండంలోని నీరు ఇప్పటికీ పాలవలె తెల్లగా ఉండటం విశేషమని, ఆ నీటిని తాగితే తీయదనంతో మధురానుభూతి కలుగుతుందని స్థానికులు చెబుతున్నారు. పూర్వకాలంలో ఋషులు, సిద్ధులు పాలగుండంలో స్నానమాచరించి అక్కడే తపస్సు, ధ్యాన సాధనలు చేసేవారని చరిత్ర చెబుతోందని పేర్కొన్నారు. రాముని పాదస్పర్శతో ఈ ప్రాంతం పవిత్రమైందనే విశ్వాసం భక్తుల్లో ఉంది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో సిద్ధులగుట్ట, పాలగుండం పరిసరాలు భక్తుల శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# శివనామస్మరణతో మారుమోగిన సోమలింగేశ్వర ఆలయం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్,బాన్సువాడ: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని సోమలింగేశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం ఉపవాసాలు చేపట్టిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తుల సౌకర్యార్థం, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో వివిధ రకాల దుకాణాలు వెలిసి పండుగ వాతావరణాన్ని తలపించాయి.

భక్తులకు సౌకర్యంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ మరింత పెరిగింది.

# శాసనసభ్యులపై అగౌరవ ప్రవర్తనకు నిరసనగా ఆందోళనలకు పద్మారావు గౌడ్ పిలుపు



ఇది కద నిజం,సికింద్రాబాద్:

శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల అధికార పక్షం అగౌరవంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపట్టాలని మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం శాసనసభకు హాజరవుతున్న ప్రజాప్రతినిధులను సైతం లోపలికి అనుమతించకపోవడం అత్యంత విచారకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలకు నిరసనగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ముఖ్యమైన కేంద్రాల్లో శాంతియుత ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు మరియు పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని నిలదీసి, పార్టీ నిరసనను శక్తివంతంగా తెలియజేయాలని సూచించారు.

# ఇంటింటా యజ్ఞంతో ఆధ్యాత్మిక సందడి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటా యజ్ఞ కార్యక్రమంలో భాగంగా పిట్లం మండల కేంద్రంలోని నీలకంటి నారాయణ ఆర్య సమాజ్ వ్యవస్థాపకుల కుమారుడు నీలకంటి మనోహర్ రామ్ లోక నివాసంలో యజ్ఞ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య యజ్ఞాన్ని నిర్వహించి, ప్రజల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు సనాతన సంస్కృతి, వేద సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని కొనసాగించారు. కుటుంబ సభ్యులు, ఆర్య సమాజ్ సభ్యులు, స్థానికులు పాల్గొని యజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఇంటింటా యజ్ఞ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఆధ్యాత్మిక వాతావరణం, సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.

# కొడంగల్ పాంచజన్య సంకల్ప సభకు ఇన్ ఛార్జీల నియామకం

ఇది కద నిజం:కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించే తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభ సమన్వయం కోసం పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఇన్ ఛార్జీలను నియమించారు. కొడంగల్ పాంచజన్య సంకల్ప సభ ఇన్ ఛార్జీలుగా పార్టీ సీనియర్ నాయకులు అర్చన సేనాపతి, గద్వాల నియోజకవర్గ ఇన్ ఛార్జి గొంగళ్ల రంజిత్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ ఇన్ ఛార్జి చిట్టినేని రఘును నియమించారు.పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ కొడంగల్ పాంచజన్య సంకల్ప సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు

# ఫోర్త్ ఎస్టేట్ సహకారం అవసరం : పల్లెల ప్రదీప్(పోలీస్ ఎస్ఐ)



సత్తుపల్లి/ వేంసూరు, సెప్టెంబర్07(ఇది కద నిజం) న్యూస్:

నియోజకవర్గ పరిధిలోని వేంసూరు పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ పల్లెల ప్రదీప్ సోమవారం మండల జర్నలిస్టులతో పరిచయ సమావేశం నిర్వహించారు.మండలంలో లాఅండ్ఆర్డర్ ను రక్షించడానికి,నేరాలు,ఘోరాలు జరగకుండా ఉండేదానికి సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్న జర్నలిస్టులు సహకారం అందించాలని ప్రదీప్ కోరారు.మండలంలో జరిగే అవాంఛనీయ సంఘటనలు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. సహకరిస్తామని జర్నలిస్టులు తెలిపారు. మూర్తి(ఈనాడు), కశీకటి రాఘవ (నవతెలంగాణ), గోపి(సాక్షి), ఆసోదు వెంకటేశ్వరరావు (ఆంధ్ర ప్రభ), మల్లూరు (తెలుగుగళం) లు పాల్గొన్నారు.

# గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపులకు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చింది. "+ఖఅవంష్త్ర ౖాతీశీఎవంఱశీఅ ఖఅఎ ×ఎఎవతీంఱశీఅ -- 2026" పేరుతో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపులకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని పిట్లం మండల ఎస్ఐ బి. ఆంజనేయులు సూచించారు. పిట్లం పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖకు ముందస్తు సమాచారం అందించడం ద్వారా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు సులభతరం అవుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం రిజిస్టర్ చేసిన దరఖాస్తుకు సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్‌ను ప్రింట్ తీసుకునే సదుపాయం కూడా ఉందని ఎస్ఐ తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుగానే ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని బి. ఆంజనేయులు సూచించారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేవైఎం డిమాండ్

**నాయకుల ముందస్తు అరెస్టులను ఖండించిన శ్రీహరి గౌడ్**



ఇది కద నిజం,నవాబుపేట్: ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజు బకాయి -- బీజేపీ లాడాయి' పేరిట బీజేవైఎం తలపెట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని బీజేవైఎం నవాబుపేట్ మండల అధ్యక్షుడు దగ్గుల శ్రీహరి గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలు, విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం ప్రభుత్వానికి తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి గౌడ్ మాట్లాడుతూ రూ. కోట్లలో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, బకాయిలు పూర్తిస్థాయిలో విడుదలయ్యే వరకు విద్యార్థుల తరఫున బీజేవైఎం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అవసరమైతే మరో పెద్ద ఎత్తున ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కాగా చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా నవాబుపేట్‌లో బీజేవైఎం మండల అధ్యక్షుడు దగ్గుల శ్రీహరి గౌడ్‌తో పాటు ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివచంద్ర రెడ్డి, కోశాధికారి వందేమాతరం, సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ మరియు పలువురు కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.

# రాజ్యాంగబద్ధ సంస్థలను అగౌరవపరచొద్దు"

**స్పీకర్‌ను దూషించడం సరికాదు: టి.డబ్ల్యూ.జె.ఎఫ్"**



హైదరాబాద్, సెప్టెంబర్07 (ఇది కద నిజం,) న్యూస్ : రాజ్యాంగబద్ధ సంస్థ అయిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ తాతా మధు అసభ్యకర పదజాలంతో దూషించడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. శాసనసభ లోపల, వెలుపల సభా మర్యాదలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సూచించింది. ప్రజా సమస్యలపై లోతైన విశ్లేషణతో చర్చించాల్సిన చట్టసభల్లో స్పీకర్‌ను దూషించడం, సభ్యుల గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా వ్యవహరించడం ఎంతమాత్రం సరికాదని పేర్కొంది. సభా మర్యాదలు, సంప్రదాయాలను ప్రజాప్రతినిధులందరూ గౌరవించాలని సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ కోరారు.

# విద్య వ్యవస్థను రేవంత్ దెబ్బ తీస్తున్నడు

- మొన్న ఇంటర్మీడియట్ రద్దు అన్నడు.. నేడు పాలిటెక్నిక్ విద్యను ప్రమాదంలోకి నెట్టాడు
- ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలి
- నెల నెలా ఫీజు బకాయిలు చెల్లిస్తామని నిండు సభలో మాట ఇచ్చి రేవంత్ రెడ్డి తప్పాడు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఫీజు పోరు యాత్రతో దద్దరిల్లిన ఓరుగల్లు
- హన్మకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ
- కలెక్టర్ కు మెమోరాండం సమర్పించి విద్యార్థుల ఇబ్బందులు వివరించిన టీఆర్ఎస్ చీఫ్





ఇది కద నిజం,హన్మకొండ :

సీఎం రేవంత్ రెడ్డి విద్య వ్యవస్థను దెబ్బతీస్తున్నాడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన చేపట్టారు. హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన కవిత అక్కడి నుంచి 3 కి.మీ.ల దూరంలోని హన్మకొండ కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కవిత ఫీజు పోరుయాత్ర ఓరుగల్లు నగరం దద్దరిల్లింది. భారీ ర్యాలీగా కలెక్టరేట్ కు చేరుకున్న కవిత సహా విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. విద్యార్థులతో కలిసి కవిత కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద నడి ఎండలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంటకు పైగా ఆందోళన చేసిన అనంతరం అధికారులు కవిత సహా విద్యార్థులను కలెక్టరేట్ లోపలికి అనుమతించారు.

అంబేద్కర్ సర్కిల్ లో, కలెక్టరేట్ ఎదుట విద్యార్థులను ఉద్దేశించి కవిత మాట్లాడారు. ప్రభుత్వం రూ.13 వేల కోట్లకు పైగా ఫీ రీయింబర్స్మెంట్ చెల్లించాల్సి ఉందని.. టైం బాండ్ నిర్దేశించుకొని ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి దెబ్బతీస్తున్నారని అన్నారు. మొన్న ఇంటర్మీడియట్ వ్యవస్థ రద్దు చేస్తానని అన్నారని.. ఇప్పుడు పాలిటెక్నిక్ విద్యను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాడని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా విద్యార్థుల జీవితాలు ఆగమావుతున్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో పేదలు, ఆడబిడ్డలు చదువుకు దురువుతున్నారని తెలిపారు. ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీలు పూర్తి చేసినా రీ యింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో కాలేజీల యాజమాన్యాలు వారికి సర్టిఫికెట్లు ఇవ్వక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని గతంలో తాను శాసనమండలి సభ్యురాలిగా సభలో లేవనెత్తానని గుర్తు చేశారు. తాను శాసన మండలిలో ప్రశ్నించినప్పుడు నెల నెలా ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పారని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలను ఆగం చేసే హక్కు ఈ ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి బకాయిలు పెట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా చిన్న చిన్న కాలేజ్ మూత పడుతున్నాయని అన్నారు. ఫీ రీయింబర్స్ మెంట్ పై ఆధారపడి చదువుకునే విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైందని అన్నారు. ప్రభుత్వం ఫీజు చెల్లించపోతుండటంతో చాలా మంది పేద విద్యార్థుల విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా ఆడపిల్లలే ఎక్కువ నష్టపోతున్నారని, ఫీజులు కట్టే స్తోమత లేక వారి తల్లితండ్రులు ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారని చెప్పారు. ఆడపిల్లలను విద్యకు దూరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.



### కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

అంబేద్కర్ విగ్రహం నుంచి హన్మకొండ కలెక్టరేట్ వరకు కవిత విద్యార్థులతో కలిసి కవిత పాదయాత్ర నిర్వహించారు. నడి ఎండలో 3 కి.మీ.లు ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. రేవంత్ సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 45 నిమిషాల పాటు ర్యాలీ చేసి కలెక్టరేట్ కు చేరుకున్నారు. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా విద్యార్థులతో పాటు కవిత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ లోకి వెళ్లి కలెక్టర్ ను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు గేట్లు మూసి అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులతో పాటు కవిత అక్కడే ఎండలో బైఠాయించారు. విద్యార్థులతో పాటు తమను కలెక్టరేట్ లోకి అనుమతించే వరకు అక్కడ నుంచి కదిలేది లేదంటూ కూర్చున్నారు. కవితతో పాటు విద్యార్థుల అరగంట పాటు ఆందోళన చేయడంతో పోలీసులు దిగివచ్చి విద్యార్థులతో పాటు కలెక్టర్ ను కలిసేందుకు అనుమతించారు.

### కలెక్టర్ కు వివరించిన కవిత

విద్యార్థులతో కలిసి హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను కవిత కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీ రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవటంతో జరుగుతున్న నష్టాన్ని కలెక్టర్ కు వివరించారు. విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినా కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. అటు ప్రజావాణిలో కూడా ఇదే సమస్యతో విద్యార్థులు వస్తున్నారని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని యాజమాన్యాలతో మాట్లాడి వారికి సర్టిఫికెట్స్ ఇప్పిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఏళ్లకేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో యాజమాన్యాలు కూడా ఇబ్బందుల్లో ఉన్నాయని.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ను కవిత కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రిప్రజంటేషన్ ను ఉన్నతాధికారులకు పంపి సమస్య పరిష్కరించేలా ప్రయత్నిస్తానని చెప్పారు.

### గ్రేటర్ వరంగల్ టీఆర్ఎస్ జైత్రయాత్ర

గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో అన్ని డివిజన్ల నుంచి పోటీలో ఉంటామని కవిత చెప్పారు. ఇక్కడ నుంచే టీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభిస్తామన్నారు. హన్మకొండ జిల్లా తరాలపల్లిలో పార్టీ జెండాను కవిత ఆవిష్కరించారు. అంతకుముందు తరాలపల్లిలో పార్టీ శ్రేణులు కవితకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రజలకు మంచి చేయాలన్న గట్టి సంకల్పంతో కొత్త పార్టీ పెట్టానని చెప్పారు. మెరుగైన విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందాలన్నదే తన లక్ష్యమని అన్నారు. సామాజిక న్యాయంతో పాటు ప్రజలకు మంచి జరగాలన్న తమ సంకల్పానికి ప్రజల ఆశీర్వాదం కావాలని కోరారు. అదే విధంగా పార్టీ నాయకులంతా ఎప్పుడు ప్రజల మధ్యలోనే ఉండి వారికి తరఫున పోరాటం చేయాలని సూచించారు.

### వనవాసం పోయినట్టుగా అయోధ్యపురం రైతుల పరిస్థితి

అయోధ్యపురం రైతుల పరిస్థితి వనవాసం పోయినట్టుగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కారణంగా భూములు కోల్పోతున్న బాధితులందరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ భూములు దేవాదాయ శాఖ భూములతో కలిసి ఉండడంతో పరిహారం విషయంలో అన్యాయం చేశారని ఈ సందర్భంగా నిర్వాసితులు కవితకు వివరించారు. దేవాదాయ శాఖతో పాటు బాధితుల భూములు కలిపి ఉండటంతో గతంలో డీజిల్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేసినప్పుడు 90 శాతం తమకు 10 శాతం దేవాదాయ శాఖ పరిహారం ఇచ్చారని బాధితులు చెప్పారు. ఇప్పుడు మాత్రం ఎకరాకు 33 లక్షల పరిహారం ఇస్తే అందులో తమకు 8 లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా ఎక్కువ మొత్తం దేవాదాయ శాఖ అప్పగించారని తెలిపారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు కోరారు. నిర్వాసితులకు పరిహారంలో న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని కవిత వారికి హామీ ఇచ్చారు. మహారాష్ట్రలోని లాతురు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన సందర్భంలో అక్కడి భూ నిర్వాసితులకు 734 ఉద్యోగాలు ఇచ్చారని కవిత గుర్తు చేశారు. అదే విధంగా ఇక్కడ కూడా భూ భాదితుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు వచ్చేలా చేస్తామన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేలోపు బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామని వారికి మాటిచ్చారు. ఈ అంశానికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖ మంత్రితో పాటు మన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు కూడా లేఖ రాస్తానని కవిత అన్నారు.

### పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన పూజలో పాల్గొన్న కవిత

అనంతరం తరాలపల్లిలోని పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో కవిత పాల్గొన్నారు. అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు కవిత గారికి ఆశీర్వచనాలు అందజేశారు. పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని కవిత అన్నారు.



### మహిళా శాసనసభ్యులపై పోలీసుల తీరు దుర్మార్గం

తెలంగాణ అసెంబ్లీ వద్ద మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గమని కవిత అన్నారు. సీనియర్ మహిళా ఎమ్మెల్యేల గొంతు పట్టి నెట్టేయడం, చీరలు లాగడం, బూటు కాళ్లతో తొక్కి హింసించడం దారుణమని “ఎక్స్” వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా శాసన సభ్యులకే ఈ రాష్ట్రంలో భద్రత లేదంటే సామాన్య మహిళల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై హింస, దాడులు పెరుగుతున్నాయని ప్రస్తుత డీజీపీ బాధ్యతలు చేపట్టాక పరిస్థితి మరింత దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడులకు కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.